క్లుప్తంగా

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గోస్పాడు: గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త చెదారం వేయకుండా ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ రాజ్ శాఖ రీసోర్స్ పర్సన్ శేషన్న అన్నారు. వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గోస్పాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కానాల సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో ప్రజా ఆరోగ్యానికి భద్రత చేకూరుతుందన్నారు. కలుషిత తాగునీరు, ఆహారం తీసుకోవడం వలన టైఫాయిడ్, నీళ్ల విరేచనాలు, పసిరికలు, వాంతులు, విషజ్వరాలు వంటివి సోకే అవకాశం ఉందని చెప్పారు.

గ్రామ పంచాయతీలకు నిధుల మంజూరు

శిరివెళ్ల: మండలంలోని గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం 2వ విడత నిధులు మంజూరయ్యాయని ఈఓఆర్డీ నాగేంద్ర మంగళవారం తెలిపారు. విద్యుత్ బకాయిలు మినహాయించుకుని 2023- 24 ఆర్థిక సంవత్సరానికి నిధులు మంజూరయ్యాయన్నారు. శిరివెళ్ల మేజర్ గ్రామ పంచాయతీకి రూ. 10.81 లక్షలు, యర్రగుంట్లకు రూ. 8.86 లక్షలు, గోవిందపల్లెకు రూ.8.63 లక్షలు కేటాయించారు. వీరారెడ్డిపల్లె పంచాయతీకి రూ. 2.27 లక్షలు, గుంప్రమాన్‌దిన్నెకు రూ. 1.93 లక్షలు, చెన్నూరుకు రూ.1.75 లక్షలు, గంగవరం రూ.1.15 లక్షలు, గుండంపాడు 1.08 లక్షలు మంజూరయ్యాయి. జీనేపల్లెకు రూ.80 వేలు, కామినేనిపల్లె రూ.91 వేలు, కోటపాడుకు రూ.1.81 లక్షలు, మహదేవపురం రూ.1.64 లక్షలు, మోత్కలపల్లె రూ.1.64 లక్షలు,వనికినిదిన్నెకు రూ. 65 వేలు, వెంకటాపురం పంచాయతీకి రూ. 82 వేలు నిధులు కేటాయించారు.

మొహర్రం వేడుకలు ప్రారంభం



కోటపాడులో కొలువైన పీర్లు

శిరివెళ్ల: మండలంలో మొహర్రం వేడుకలు మొదలయ్యాయి. శిరివెళ్ల, యర్రగుంట్ల, గోవిందపల్లె, కోటపాడు, మహదేవపురం, బోయలకుంట్ల, జీనేపల్లె, వనికినిదిన్నెలలో చావిళ్లలో పీర్లలను కొలువు చేశారు. వేడుకలలో భాగంగా ఈ నెల 26న చిన్న సరిగెత్తు, 27న మధ్య సరిగెత్తు, 28న పెద్ద సరిగెత్తు జరగనున్నాయి. అలాగే దాదాపు 17 ఏళ్ల తర్వాత కోటపాడులో మొహర్రం వేడుకలు జగనున్నాయి. ఆగస్టు 6వ తేదీన మౌలాలి స్వామి జారతలు జరపాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు.

దొర్నిపాడు: మొహర్రం వేడుకలను పురస్కరించుకొని మండలంలోని గ్రామాల్లో ఆయా చావిడిల్లో పీర్లను కొలువుంచారు. మండలకేంద్రంలో బారాఇమాం, దస్తగిరి, మౌలాలి స్వాములను కొలువుంచి మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



కొలువైన పీర్లకు ఫాతెహాలు సమర్పిస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో అష్టాదళ పాద పద్మారాధన సేవ



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబా చంద్రశేఖర దేవస్థానంలో అధిక శ్రావణమాసం పురస్కరించుకొని మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలు, నిమ్మరసంచే ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం 108 వెండి పుష్పాలచే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం జరిపించారు. అనంతరం అమ్మవారికి చీర, ఒడి బియ్యం కార్యక్రమాన్ని సమర్పించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్రాచారి, సుబ్బాచారి, ఆరవేటి వాసు, విజయకుమార్, నరసింహ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి తప్పిన ప్రమాదం

మహానంది: బొల్లవరం గ్రామానికి చెందిన తురగ చిన్నమ్మ నివాసం ఉంటున్న మట్టిమిద్దె పెచ్చులు ఊడి పడడంతో ప్రమాదం తప్పింది. సోమవారం రాత్రి ఆమె ఇంటిలో నిద్రిస్తుండగా మట్టిపెల్లలు విరిగిపడ్డాయి. దీంతో అప్రమత్తమైన ఆమె ప్రమాదాన్ని గుర్తించడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. విషయం తెలుసుకున్న వీఆర్వో చెలమయ్య ఆమె ఇంటి వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు.

‘జగనన్న సురక్ష’ పేదలకు వరం



నంద్యాల వైఎస్సార్ నగర్‌లో లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందిస్తున్న మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు



మున్సిపల్ కార్యాలయంలో సర్టిఫికెట్ అందిస్తున్న ఏపీఎస్పీడీసీఎల్ రాష్ట్ర డైరెక్టర్ శశికళారెడ్డి

నంద్యాల(సిటీ): పట్టణంలోని పేదలకు జగనన్న సురక్షతో మంచి జరుగుతుందని ఏపీఎస్పీడీసీఎల్ రాష్ట్ర డైరెక్టర్ శశికళారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, వైఎస్సార్ నగర్, పెద్ద చర్చ్ వద్ద కమ్యూనిటీ హాల్‌లలో జగనన్న సురక్ష క్యాంపులను నిర్వహించారు. సలీంనగర్, మున్సిపల్ కార్యాలయం, ఎంఎస్‌నగర్, వీసీకాలనీ, నందమూరి నగర్, వైఎస్సార్ నగర్ వార్డులకు సంబంధించి సుమారుగా 5,187 దరఖాస్తులకు గాను 4,700 మందికి టోకన్లు ఇవ్వగా 4,086 మందికి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు నమోదు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శశికళారెడ్డి లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ. పట్టణ పరిధిలోని పేదలందరికీ అర్హత ఆధారంగా సంక్షేమాన్ని అందించేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష లాంటి వినూత్నమైన కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ఈ క్యాంపుల ద్వారా ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలను అందుకునేందుకు అవసరమైన 11 రకాల ధ్రువ పత్రాలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. వైఎస్సార్ నగర్ క్యాంపులో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు షేక్ బషీద్, పోలూరు లక్ష్మీదేవి, ఎస్.సంజీదా, తూర్పునాటి సావిత్రమ్మ, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్‌లు జాకీర్‌హుస్సేన్, పోలూరు రామచంద్రుడు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాల మంజూరు

గోస్పాడు: ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అప్పటికప్పుడే అందజేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమమని మండల కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, ఎంపీపీ ఆర్థర్ సైమాన్ అన్నారు. మండలంలోని జిల్లెల్ల గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం ఎంపీడీఓ భాస్కర్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయ శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో 1,042 మందికి ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓబులమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు శేఖర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాల లబ్ధి

ఆళ్లగడ్డ : అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చడమే ‘జగనన్న సురక్ష’ లక్ష్యమని ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్ అన్నారు. రూరల్ మండలం ఓబులంపల్లె గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం ‘జగనన్న సురక్ష’ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ తహీర్‌హుస్సేన్, సర్పంచ్ మౌలాఖాశీం, ఎంపీటీసీ నాగసులోచన, రవీంద్రారెడ్డి తదితరులు ఉన్నారు



గోస్పాడులో ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎంపీపీ ఆర్థర్ సైమాన్

పేదలకు మేలు

ఉయ్యాలవాడ : పేదలకు మంచి చేయడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన ఉయ్యాలవాడ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచ్ మేకల ఓబులేస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీపీతో పాటు మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, మండల రైతు సలహా మండలి చైర్మన్ పోచా రాధాక్రిష్ణారెడ్డి, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు.



ఉయ్యాలవాడలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ

సద్వినియోగం చేసుకోండి

రుద్రవరం: జగనన్న సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు రవీంద్ర ప్రసాదు అన్నారు. మండల పరిధిలోని చిత్రేనిపల్లెలో మంగళవారం సర్పంచు గుండా వరలక్ష్మి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 297 మంది లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచు జవాజి లింగమ్మ, ఎంపీడీఓ మధుసూదనరెడ్డి, నాయకులు వెంకటనరసింహ్మయ్య, మాధవ, నరసింహ్మ, బాలయ్య తదితరులు ఉన్నారు.

జగనన్న సురక్షలో కళాజాత

శిరివెళ్ల: స్థానిక 2వ గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల అమలు, బాల్య వివాహాలు, ప్లాస్టిక్ నిషేధం, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లపై కళాకారులు ఆట, పాటల ద్వారా ప్రజలను చైతన్య పరిచారు. అనంతరం 413 మందికి కుల, ఆదాయ, రేషకార్డులపై ధ్రువ పత్రాలను సర్పంచు సాలమ్మ, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, మాజీ జెడ్పీటీసీ నజీర్ పంపిణీ చేశారు. అలాగే జీనేపల్లెలో సర్పంచు దగడ మహేశ్వరి అధ్యక్షతన జరిగిన సురక్ష శిబిరంలో 386 మంది వివిధ ధ్రువ పత్రాలను అందజేశారు. కార్యక్రమాలలో ఎంపీడీఓ సుబ్రమణ్యం, తహసీల్దార్ షేక్ మొయిద్దీన్, మండల ఉపాధ్యక్షురాలు చీమల అనూష, ఉప సర్పంచు ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.



శిరివెళ్లలో ప్రభుత్వ పథకాలపై కళాజాత

అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలోని 4వ సచివాలయ కార్యాలయం వద్ద మంగళవారం తహసీల్దారు సుభద్రమ్మ, ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ సుదర్శనరావు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ తోల సమ్మ, ఎంపీపీ వీరభద్రుడు ముఖ్య అతిథులుగా హాజరై 136 మందికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. శెట్టివీడు గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ మహబూబ్ దౌలా, డీటీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యురాలు జి.లక్ష్మీదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 195 మందికి ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి, ఎ.లక్ష్మీరెడ్డి, రామ్లా నాయక్, సర్పంచ్‌లు ఎర్రోల్ల లక్ష్మీదేవి, మూడె శ్రీలక్ష్మీబాయి, ఎంపీటీసీ ఎద్దుల రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



శెట్టివీడులో రైతులకు కౌలు కార్డులను అందజేసున్నన్న జెడ్పీటీసీ లక్ష్మీదేవి, అధికారులు

విద్యా సంస్థల బంద్ విజయవంతం



నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

నంద్యాల(న్యూటౌన్): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తలపెట్టిన బంద్ నంద్యాలలో మంగళవారం విజయవంతమైంది. ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్ఏ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు, శివకృష్ణయాదవ్, నాగార్జున మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను, యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని కొనసాగించి ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించాలన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని నియంత్రించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం సాయిబాబానగర్ సెంటర్‌లో అన్ని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎల్‌కేజీ నుండి పీజీ వరకు విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎర్రిస్వామి, మనోహర్, బాలాజీ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

వదలని వర్షం



దొర్నిపాడులో మిరప విత్తుతున్న రైతు

దొర్నిపాడు: ఐదు రోజులుగా వర్షం విడవకుండా కురుస్తోంది. విరామం లేకుండా జల్లులు కురుస్తున్నాయి. దీంతో రైతులు పత్తి, మిరప విత్తనాలు నాటేపనిలో నిమగ్నమయ్యారు. అలాగే ఖరీఫ్‌లో భాగంగా ముందస్తుగా సాగుచేసిన మినుము, మొక్కజొన్న పంటలకు ఈ వర్షం ఊరటనిచ్చింది. ఇక విద్యార్థులు బడికి రాకపోకలకు తల్లిదండ్రులు వర్షానికి గొడుగులు పట్టుకొని ఇళ్లకు తీసుకపోతున్నారు. వర్షానికి తడిస్తే సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తల్లిదండ్రులు ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

జోరుగా మిరప సాగు

నర్విరామంగా కురుస్తున్న వర్షాలు మిరప సాగుకు అనుకూలంగా మారాయి. దీంతో రైతులు మిరప విత్తనాలను జోడెడ్ల సాయంతో పొలాల్లో విత్తుతున్నారు. బోర్ల కింద 568 హెక్టార్లలో మిరప సాగుచేయగా కౌలురైతుల సహా అందరూ మంచి లాభాలను ఆర్జించారు. దీంతో ఈ సారి ఇంకా మిరప సాగు విస్తీర్ణం పెంచే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

చాగలమర్రిలో 11 మిమీ వర్షపాతం

చాగలమర్రి: గత నాలుగు రోజులుగా మండలంలో ఒక మోస్తరుగా కురుస్తున్న చిరు జల్లులతో చాగలమర్రిలో 11 మిమీ వర్షపాతం నమోదైనట్లు డీటీ విజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈ వర్షాలకు పొలాల్లో దుక్కులు దున్ని ఖరీఫ్ సీజన్ సిద్ధమయ్యారు.

బోరు, పైపులైన్ పనులకు నిధులు మంజూరు



బోరు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ శంకరమ్మ, కన్వీనర్ కుమార్ రెడ్డి

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు, మజరా గ్రామమైన ఎం తండాలో తాగునీటి బోరు, పైప్‌లైన్ పనులకు రూ.5 లక్షలు జిల్లా పరిషత్ నిధులు మంజూరైనట్లు జెడ్పీటీసీ సభ్యురాలు జి.లక్ష్మీదేవి తెలిపారు. మంగళవారం ఎం తాండాలో ముత్యాలపాడు గ్రామ సర్పంచ్ శంకరమ్మ టెంకాయ కొట్టి బోరు పనులను ప్రారంభించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ ముత్యాలపాడు గ్రామంలో తాగునీటి కోసం పైప్‌లైన్ నిర్మాణానికి రూ.2.50 లక్షలు, అలాగే మజరా గ్రామమైన ఎం తాండాలో బోరు, మోటారు పైప్‌లైన్ నిర్మాణానికి రూ.2.50లక్షల నిధులు జిల్లా పరిషత్ నుంచి మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఓబులేసు, వైఎస్సార్‌సీపీ నాయకులు శేషు రమేష్, రమణ, రమణారెడ్డి, ఎర్రం నవీన్ తదితరులున్నారు.

సర్వేకు సహకరించాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

పాణ్యం: ఓటరు జాబితా సవరణ సర్వేకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి కోరారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్వేలో వలంటీర్లు పాల్గొనరాదన్నారు. అన్ని రకాల ఓటర్లకు సంబంధించి అర్జీలు స్వీకరిస్తామన్నారు. తర్వాత మార్పులు, చేర్పులకు కూడా గడువు ఉంటుందన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే చెప్పొచ్చన్నారు. అనంతరం సమీపంలోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అనురాధ పాల్గొన్నారు.

శిథిలావస్థలో పోలీస్ క్వార్టర్స్

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- పశువుల పాకలు వేస్తున్న స్థానికులు



శిథిలావస్థకు చేరిన పోలీసు గృహ సముదాయం

చాగలమర్రి: మండల కేంద్రంలో పోలీసు సిబ్బంది కోసం ప్రభుత్వం నిర్మించిన గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇందులో కొన్నేళ్లుగా ఎవరూ నివాసంలేకపోవడంతో కొంత మంది మందుబాబులు, పేకాట రాయుళ్లు అసాంఘిక కార్యాకలాపాలకు ఉపయోగించుకుంటున్నారు. పోలీసుస్టేషన్ కూత వేటు దూరంలో ఉన్న వారిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. గ్రామానికి నడిబొడ్డున ఉన్న ఈ గృహ సముదాయం స్టేషన్‌కు దగ్గరగా ఉండటంతో అటు నివాసానికి ఇటు విధులు నిర్వహించేందుకు పోలీసు సిబ్బందికి అందుబాటులో ఉంటుంది. అయితే గత 15 సంవత్సరాలుగా ఇవి నిరుపయోగంగా ఉన్నాయి. గృహ సముదాయ స్థలంలో కొంత మంది పెంట దిబ్బలు వేయగా, కొంత మంది పశువుల పాకలు, చుట్టు పక్కల ప్రజలు కసువు దిబ్బలు వేయడంతో అపరిశుభ్రంగా మారి దుర్వాసన వెలదజల్లుతోంది. గ్రామానికి బదిలీపై వచ్చిన పోలీసు సిబ్బందికి ఇల్లు అద్దెకు దొరకటం కష్టంగా మారింది. పోలీసు స్టేషన్‌కు దూరంగా ఇల్లు ఉండటంతో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా పోలీసు ఉన్నత అధికారులు చొరవ తీసుకొని ఈ గృహ సముదాయం స్థానంలో నూతన గృహాలు నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుందని పోలీసులు సిబ్బంది, స్థానికులు కోరుతున్నారు.



కట్టడం దెబ్బతిని కూలడానికి సిద్ధంగా ఉన్న భవనం

భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి

నంద్యాల(న్యూటౌన్): పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నిరంజన్, కిరణ్ మాట్లాడుతూ రూ.8 కోట్లతో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల హాస్టల్ భవనానికి పనులు ప్రారంభించారన్నారు. 4 సంవత్సరాలు గడుస్తున్నా పనులు పూర్తిచేయలేదని చెప్పారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ప్రైవేటు హాస్టల్‌లో నెలకు రూ.4వేలు చెల్లిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఇస్మాయిల్, అఖిల్, మహేష్, భార్గవ్ పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

నంద్యాల(న్యూటౌన్): పద్మావతినగర్ సొసైటీలో జరుగుతున్న అవకతవకలపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, ప్రసాద్ కోరారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని పద్మావతినగర్‌లో 1970లో 64ఎకరాల్లో సభ్యులతో సొసైటీ ఏర్పడిందన్నారు. ఆ స్థలాల్లో అప్పట్లో ఇళ్లు నిర్మించుకోలేదని, ధరలు పెరగడంతో సొసైటీలో కొంత మంది సభ్యులు స్థలాలపై కన్నుపెట్టి తారుమారు చేసి ఎక్కువ ధరలకు అమ్ముకుంటున్నారన్నారు. పద్మావతినగర్‌లో కేసీ కెనాల్ పోరంబోకు భూములు కూడా ఆయా స్థలాల్లో ఉన్నా యజమానులు కబ్జాలు చేస్తున్నారని చెప్పారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

నంద్యాల(న్యూటౌన్): మణిపూర్ రాష్ట్రంలో మహిళలను నగ్నంగా ఊరేగించి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించి ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి సోమన్న, శ్రీనివాసులు, వ్యకాస జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ సెంటర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ మహిళలను సభ్యసమాజం తలదించుకొనే విధంగా చేసిన దుండగులపై కేసు నమోదు చేసి శిక్షించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో రంగయ్య, రవికుమార్, హుసేన్‌బాషా, ఈశ్వరమ్మ, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

గండి పూడ్చివేత

కొత్తపల్లి: మండలంలోని శివపురం గ్రామ శివారులో ఉన్న ఈర్ల చెరువుకు సోమవారం గండి పడిన విషయం విధితమే. స్పందించిన అధికారులు గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, గ్రామ పెద్దలు, రైతుల సమక్షంలో మంగళవారం జేసీబీతో గండిపడ్డచోట మరమ్మతులు చేయించారు. దీంతో చెరువు కింద ఉన్న ఆయకట్టు రైతులు తమ పొలాలు నీట మునిగే ప్రమాదం తప్పిందని ఆనందవ వ్యక్తం చేస్తున్నారు. అలాగే గత రెండేళ్ల క్రితం కిందట చెరువుకు పలుచోట్ల గండిపడడంతో అప్పట్లో కూడా పనులు చేయించారని తెలిపారు.

పక్కాగా ఓటరు నమోదు



మాట్లాడుతున్న అనురాధ

నంద్యాల(అర్బన్): రాజకీయ పార్టీల బీఎల్ఏల సహకారంతో బీఎల్ఓలు పక్కాగా ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపడుతారని నంద్యాల నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారిణి అనురాధ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఓటర్ల జాబితాపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ చంద్రనాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అనురాధ మాట్లాడుతూ ఈనెల 21 నుంచి వచ్చే నెల 21వరకు కొత్త ఓటరు నమోదు, డెత్, డబుల్ ఓట్లు, తదితర వాటిపై బీఎల్ఓలు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారన్నారు. వారికి రాజకీయ పార్టీ బీఎల్ఏలు సహకారం ఇవ్వాలని కోరారు. బీఎల్ఓలు ఎటువంటి పొరపాట్లకు తావు ఇవ్వకుండా ఓటరు నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జేసీఎస్ సాయిరాంరెడ్డి, బీజేపీ జయభారత్‌రెడ్డి, సీపీఐ సాంబశివుడు, సీపీఎం బాలవెంకట్, సీపీఐ సుబ్బరాయుడు, కాంగ్రెస్ రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం సందర్భంగా ఈఓ ఎస్ లవన్న, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

200 మందికి క్షయ నిర్ధారణ పరీక్షలు



క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకునేందుకు క్యూలో నిలిచిన ప్రజలు

కొత్తపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యులు వినోద్‌కుమార్, దీపానాగవేణి, గోకవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు జుబేదా, విజయేంద్రల ఆధ్వర్యంలో 200 మందికి మొబైల్ ఎక్స్‌రే క్యాంపు ద్వారా క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ కర్నూలు అశ్వినీ హాస్పిటల్, సేవా భారతి స్వచ్ఛంద సేవా సంస్థ, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సమన్వయంతో ఆత్మకూరు టీబీ యూనిట్ ఆధ్వర్యంలో క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీరికి రూ.400 విలువచేసే డిజిటల్ ఎక్స్‌రేని పీహెచ్‌సీల తరపున ఉచితంగా తీయడం జరిగిందన్నారు. ఇందులో క్షయ వ్యాధి నిర్ధారణ అయితే వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ బాలకృష్ణ, టీబీ సూపర్ వైజర్లు మస్తానయ్య, రవికుమార్, పీహెచ్ఎన్ అయేషా, సూపర్‌వైజర్లు దేవ కరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీవాల పెంపకం లాభదాయకం

కోవెలకుంట్ల: గొర్రెలు, మేకల పెంపకం అన్ని విధాలా లాభదాయకమని గొర్రెల పెంపక శిక్షణ కేంద్ర సహాయ సంచాలకులు శ్రీనివాసరెడ్డి, రామసుబ్బారెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ క్రాంతిపథ కార్యాలయ సమావేశ భవనంలో రాష్ట్ర గొర్రెల పెంపక శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో కోవెలకుంట్ల, గోస్పాడు మండలాల గొర్రెల పెంపకందారులకు ఒక రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. గొర్రెల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులు, జీవాలకు సోకే అంటువ్యాధులు, నివారణ పద్ధతులు, టీకాల ప్రాముఖ్యత, నట్టల నివారణ, విత్తన పొట్టేళ్ల మార్పిడి, ప్రస్తుత వర్షాకాలంలో జీవాలకు సోకే వ్యాధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులు వ్యవసాయంతోపాటు జీవాల పెంపకం చేపట్టి ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్ర పశువైద్యాధికారులు ప్రశాంతి, జానకి, శ్రీనివాసులు, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, కోవెలకుంట్ల, గోస్పాడు పశువైద్యులు కృష్ణకుమార్, ఉమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితుల ధ్రువపత్రాల పరిశీలన



రైతుల డాక్యుమెంట్లు పరిశీలిస్తున్న అధికారులు

వెలుగోడు: మండలంలో 167కే కల్వకుర్తి–నంద్యాల జాతీయ రహదారి నిర్మాణంలో స్థిర, చర ఆస్తులు కోల్పోతున్న రైతులు, ప్రజల నుంచి భూహక్కు పత్రాలను పరిశీలించారు. మంగళవారం తహసీల్దార్ నారాయణరెడ్డి, అవార్డు ఎంక్వై రీ కమిటీ, నేషనల్ హైవే కమిటీ సమావేశం జరిగింది. తహసీల్దార్ మాట్లాడుతూ.. బోయరేవుల గ్రామంలో 142 మంది రైతులు 5.29 ఎకరాల భూమి జాతీయ రహదారి నిర్మాణంలో కోల్పోతున్నారు. మోతుకూరు గ్రామంలో 182 మంది రైతులు 6.30 ఎకరాల భూములు కోల్పోతున్నారని తెలిపారు. నేషనల్ హైవే డిప్యూటీ తహసీల్దార్ యూసుఫ్ మాట్లాడుతూ..నంద్యాల-కల్వకుర్తి జాతీయ రహదారి నిర్మాణంలో ఐదు మండలాల రైతులు భూములు కోల్పోతున్నారని చెప్పారు. మొత్తంగా 620.30 ఎకరాల భూమి రైతుల నుంచి సేకరించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా బోయరేవుల, మోతుకూరు గ్రామాల్లో భూములు కోల్పోతున్న రైతులు వాటికి సంబంధించిన 13 సంవత్సరాల ఈసీ, అడంగల్, ఆర్వోఆర్ (బీ), బ్యాంకు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, టైటిల్ డీడ్, దస్తావేజుల నకలు, వివిధ రకాల కట్టడాలకు సంబంధించిన నకళ్లను సమర్పించాలని తెలిపారు. ఐదు రోజుల వరకు తహసీల్దార్ కార్యాలయంలో సంబంధిత వీఆర్‌వోలు ధ్రువ పత్రాలు స్వీకరిస్తారని చెప్పారు.